

# నిజం

అడవి శివసుబ్రహ్మణ్యం

అప్పుడే చూచివచ్చిన హిందీ సినిమాలో పాట ఒకటి పాడుకుంటూ, ఇంటితాళం తెరుస్తున్న రఘునాథ్‌కి, ఇంటి వారబ్బాయి మురళి వచ్చి, ఒక టెలిగ్రాం కవరును అందించి, "ఇది మీకు-సాయంకాలం, ఆరు గంటలకు వచ్చిందండీ—ఇప్పటిదాకా మీకోసమే చూస్తున్నాం" అని చెప్పి వెళ్ళిపోయాడు.

"మై గుడ్నెస్ !" అంటూ కవరునందుకొని, తలుపుతెరచి, తాళం టేబులుపైన పెట్టి, కుర్చీలో కూలబడ్డాడు రఘు కవరు నొకసారి పరిశీలనగా చూశాడు. దానిపైన తన విరునామావుంది, ఎక్కడనుంచి వచ్చివుంటుంది? మనసులోని ఆతృతను అణచిపెట్టుకోలేక పోతున్నాడు.

ఆ రోజు సాయంకాలమే, రఘుకు అతడి మామ భానుమూర్తిగారి దగ్గరనుంచి ఒక ఉత్తరం వచ్చింది. "చి. సౌ ఉమ, నిన్న రాత్రి 11–30 గంటలకు మగబిడ్డను ప్రసవించింది. తల్లీ శిశువులు క్షేమం. వీలు చూసుకొని రావలెను" అని మరి ఈ టెలిగ్రాం మాట ఏమిటి ? తన మామగారి దగ్గరనుంచి కాదుగదా, కొంపతీసి!...తనకు టెలిగ్రాం ఇచ్చేవారెవరున్నారు? ఊహూఁ.... తన కెవ్వరూ టెలిగ్రాం ఇవ్వరు. అయినా ఏమో - ఎవరు చెప్పగలరు? కాని, సాయంకాలం వచ్చిన కార్డు మాటేమిటి 'తల్లీ శిశువులు క్షేమం' అని? ఆ ఉత్తరం చూచుకుని, తను, రేపు శనివారం కాలేజికి వెళ్ళి సోమవారంనుంచి శెలవుపెట్టి మామగారింటికి వెళ్ళవచ్చు ననుకొన్నాడు. ఆ ఉత్తరం చూచుకొనే, సాయంకాలం, తనకు ప్రథమంగా పుత్రుడు కలిగిన ఆనందంలో, మిత్రులందరకూ పార్టీకూడా చేశాడు. ఇంతలో ఈ టెలిగ్రాం..."ఊహూఁ...ఈ టెలిగ్రాం చదువకూడదు" అనుకొని, ఆకవరు చింపకుండానే జేబులో వేసుకొన్నాడు.

ఒక తెల్లకాగితం తీసుకుని, శెలవుచీటి వ్రాసి, ఇంటివారబ్బాయి మురళికి ఇచ్చాడు, మరునాడు కాలేజిలో ఇవ్వమని. సూట్‌కేసులో రెండుపాంటులు, రెండు షర్టులు, ఇంకా అత్యవసరమైన వస్తువులు కొన్ని వేసుకొన్నాడు. టైము పదకొండు గంటలైంది. మరొక అరగంటలో ఎక్స్‌ప్రెస్ వుంది. త్వరగా స్టేషనుకువెళ్ళి, అది ఎక్కగలిగితే, ఉదయానికి బెజవాడ చేరుకో వచ్చును.

స్టేషను అట్టే దూరం లేదు. మళ్ళీ ఏ టాక్సీకోసమో ఎదురుచూస్తూ వుంటే, రైలు అందకపోవచ్చును. కాలినడకను వెళ్ళినా, అరగంటలోగా స్టేషను చేరుకో వచ్చును. సూట్‌కేసు తీసుకుని, కాలినడకను బయలుదేరాడు, రఘునాథ్.

బయట చీకటి !

మనసులో ఆరాటం !

అర్ధరాత్రి అంధకారం నృత్యం చేస్తోంది. అక్కడక్కడ రోడ్డుప్రక్క నిలచివున్న దీపపు స్తంభాలు, చీకటితో పోటీపడి, గెలవాలని ప్రయత్నిస్తున్నాయి. ఎక్కడో అరుస్తున్న కుక్కల అరుపులు--ఉండి ఉండి ప్రక్కనుంచి దూసుకుపోతున్న నిండు లారీలు-అవేమీ పట్టకుండా, అప్పుడప్పుడు ఒక చేతిలోని సూట్‌కేసును మరొక చేతిలోకి మార్చుకుంటూ, ముందుకు సాగిపోతున్నాడు, రఘునాథ్. బూటు కాలికి రాయి తగిలి, బోర్లా పడబోయి, నిలద్రొక్కుకున్నాడు ఒకసారి.

రఘునాథ్ స్టేషనుకు చేరుకొనేసరికి

కోలాహలంగా వుంది. మరొక అయిదు నిముషాలలో రైలు రాబోతోందని తెలిసింది. టిక్కెట్టు కొన్నాడు. రాత్రి అంతా రైల్లో గడపాలి. ఇంక నిద్ర పట్టదు. దగ్గర సిగరెట్లు అయిపోయాయి. 'పాన్—బీడా. అని అరుచుకొంటూ పోతున్న కుర్రవాడ్ని పిలిచి, 'బర్కిలీ పాకెట్ ఒకటియ్యి' అని తీసుకొన్నాడు. డబ్బులకోసం జేబులో చెయ్యి పెడితే—కవరు చేతికి తగిలింది. మళ్లీ—అదే కవరు—అతడికి డబ్బులిచ్చి పంపేశాడు. ఆ కవరు—ఆ కవరు తన దగ్గర వుండి, మనశ్శాంతిని మాయం చేస్తోంది. ఏం చెయ్యాలి—ఏం చెయ్యాలి? స్టేషను దగ్గరలో మలుపు తిరిగిన పట్టాల మీదనుంచి, రైలుబండి లైటు కాంతి ఒక్కసారిగా వెలిగింది.

జనం అందరితోపాటుగా, తనూ రైలులో ఎక్కాడు. అయిదు నిముషాలే ఆగింది రైలు. గంట మ్రోగింది. కూత కూసి రైలు బయలుదేరింది. రైలులో జనం అంతగా లేరు

చేతిలో కవరు అలాగే వుంది...ఇది తన దగ్గర వుండకూడదు... ఏం చెయ్యాలి... వెంటనే ఒక నిర్ణయానికి వచ్చాడు. గోదావరి వరద పరవళ్ళలా, ఆలోచనల తరంగాలు అతడి మెదడులో కలవరాన్ని రేపుతున్నాయి. ఆ కవరును పర్రు మని చించాడు. మరొకసారి చించాడు. అలా చిన్న చిన్న ముక్కలుగా చేసి, కిటికీగుండా గాలిలోకి విసిరివేశాడు.

హమ్మయ్య! ఇప్పుడు మనస్సుకు శాంతిగా వుంది. జేబులోని ఉత్తరం మరొకసారి తీసి చదువుకున్నాడు. 'చి.సౌ. ఉమ, నిన్న రాత్రి 11—30 గంటలకు మగబిడ్డను ప్రసవించింది. తల్లీశిశువులు క్షేమం. మీలు చూసుకొని, బయలుదేరిరావలెను.'' సంతృప్తిగా ఒకసారి ఊపిరి పీల్చుకొన్నాడు. సిగరెట్టు ఒకటితీసి, వెలిగించాడు. గట్టిగా రెండుదమ్ములు లాగినతర్వాత, మనస్సులో కొత్తగా ఉత్సాహం వెల్లివిరిసింది. దట్టమైన సిగరెట్టు పొగలో, ఉమరూపం, కన్నులముందు నిలిచింది.

* * *

ఎండలో ఆరబెట్టిన ఒడియాలు, కాకులు తినిపోకుండా, కాపలాకాస్తున్న పదేళ్ల సుబ్బులు, చేతిలో సూట్‌కేసుతో రిక్షాదిగి లోపలికి వస్తున్న రఘును చూసి, ''అమ్మా— అబ్బ మామయ్యొచ్చాడేవ్!'' అంటూ, ఇంట్లోకి పరుగెత్తింది. ఆమాట విని, లోపలనుంచి బయటకువచ్చిన జానకి, తమ్ముడ్నిచూసి, 'సుబ్బులూ—చెంబూనీళ్లూ పట్టామ్మా— మామయ్య కాళ్లు కడుక్కుంటాడు'' అంది.

కాళ్లు కడుక్కొని లోపలికి వస్తున్న రఘునాథ్‌కు కుర్చీవేసి, ''మంచినీళ్లు కావాలా?'' అని అడిగింది.

'ఊఁ!' అన్నాడు రఘు, ఎండవేడికి కాస్త ఒగరుస్తూ.

జానకి కూజాలోని మంచి నీళ్ళుతెచ్చి, తమ్ముడికిచ్చి, ''ఏరా —ఉత్తరం ముక్కయినా రాయకుండా, ఉన్నట్టుండి ఊడిపడ్డా వేమిటి?'' అంది.

'ఏమీలేదు. ఓనల్గాళ్ళు శలవుపెట్టి అందర్నీ చూచి పోదామని బయలుదేరాను' అన్నాడు.

జానకి లేచి, కాఫీపెట్టటానికి నిప్పు రాజేసింది. రఘుకూడావచ్చి, వంటింటి గడప దగ్గర పీట వేసుకొని కూర్చున్నాడు.

'కొంచెం అన్నంవుంది. తింటావా?' అని అడిగింది, జానకి.

'ఉహూఁ...తినేవచ్చాను. అది సరేకాని నీ ఆరోగ్యం ఎలావుంటోందక్కయ్యా ఈ మధ్య?' అన్నాడు.

జానకి కుంపటి విసరుతోంది. 'నా ఆరోగ్యం బాగానేవుంది. ఆసీనుగాడికి మొన్నటిదాకా కురుపులు, జ్వరం—మట్టిలో ఆడకురా అంటే వినడుకద—వెధవ—ఈ పిల్లలతో చెడ్డగొడవగావుంది. ఈ గొడవెప్పుడూ వుండేదేకాని, పూనాలో ఎలా వుంటున్నావు ఏమిటి—చెప్పు?' అంది.

'పూనాకేం—బ్రహ్మాండంగా వుంది. ఇక్కడలా, మనుషులను పెనం మీద వేయించినట్టుగా, ఎండలుండవు' అన్నాడు రఘు.

'ఎండలు సరే—అక్కడ తిండి—అది—ఎలా వుంటోంది—ఆమధ్య కొన్నాళ్ళు, వుండలేక పోతున్నానని ఉత్తరాలు రాసే వాడివికదూ!' అంది.

'ఇప్పుడా బెంగేంలేదు—అన్నం లేక పోయినా, పూర్తిగా చపాతీలతోనే కడుపు నింపుకోవటానికి అలవాటు పడ్డాను. అయినా, ఇంకెంతకాలం అక్కయ్యా—మహా అయితే,మరోసంవత్సరం—అంతేగా ఎం. కాం. కాస్త పూర్తి అవుతుంది అప్పటికి' అని చెప్పాడు రఘు.

''నువ్వు కాలేజికి ఎప్పుడు వెడతావు—ఆఫీసుకు ఎప్పుడు వెడతావు?—టయిము సరిపోతుందా?' అని ప్రశ్నవేసింది జానకి.

'ఉదయం ఏడుగంటలనుంచీ తొమ్మిది గంటలవరకూ కాలేజిలో వుంటాను. పది గంటలకు ఆఫీసుకు వెడతాను.'

ఇంతలో 'అబ్బ మామయ్యా—నాకేం తెచ్చావు, పూనానుంచి?' అంటూ, సుబ్బులు వచ్చి, కూర్చున్నరఘుభుజానికి జార్లపడింది.

రఘు లేచి, సూట్‌కేసు తెరచి, స్వీట్సు పాకెట్లు రెండుతీసి. 'నీకొకటి, సీనుగాడి కొకటీ' అని చెప్పి, సుబ్బులుకు అందించాడు. తర్వాత, మరొక పాకెట్‌లో వున్న చీరతీసి, 'అక్కయ్యా—ఇది అవురంగాబాదు సిల్కుచీర—నీకోసం ప్రత్యేకంగా తెచ్చాను' అనిచెప్పి, జానకి కిచ్చాడు.

జానకి చేతులు కడుక్కునివచ్చి, ఆ చీరను విప్పిచూచి, 'బాగుందిరా తమ్ముడూ!' అంది సంతోషపడి.

సాయంకాలం బాంకునుంచి నారాయణ వచ్చాడు. వరండాలో కుర్చీలో కూర్చుని, పేపరు చదువుతున్న రఘునిచూచి, 'ఏరా బావా—ఎప్పుడు రావటం?' అని అడిగాడు.

'మధ్యాహ్నం వచ్చాను. బ్యాంకుకు వద్దామనుకున్నాను. ఎండగా వుందని రాలేదు' అన్నాడు రఘు.

ఫ్లాస్కులోని కాఫీగ్లాసులో పోసి ఇచ్చింది జానకి. కాఫీ చప్పరిస్తూ, రఘుపక్కన తనూ ఓకుర్చీ వేసుకొని కూర్చున్నాడు నారాయణ. 'ఏంబావా ఏమిటి—పూనాలో ఒంటరిగానే వుంటున్నావా?' అన్నాడు, శ్లేష ధ్వనించేలాగ.

'ఊహూఁ....'తల ఆడించాడు రఘు.

'మరి—?' నారాయణ ఆశ్చర్యపోయాడు.

'నేనూ—నా అప్పులూ!'

'హారి నీ—భలేవాడివే! నే నింకా ఏదో అనుకున్నాను' అని, జానకి వంక ఓరగా చూశాడు, నారాయణ.

'మా తమ్ముడేమీ, మీరనుకొనే లాంటివాడు కాదులెండి' అంటూ, తమ్ముడ్ని వెనకేసుకొచ్చింది జానకి.

ఆ రోజు ఆదివారం.

# నిజం

సాయంకాలం, నారాయణ, ఏవో సామా
నులు తేవాలని, బజారుకు బయలుదేరాడు.
తనూ వస్తానని గొడవచేసి, సుబ్బులు
అతన్ని అనుసరించింది.

'నువ్వూ వస్తావేమిట్రా బావా?' అని
అడిగాడు నారాయణ, ఏదో నవల చదువు
తూంటున్న రఘుని.

'నువ్వు వెళ్ళొచ్చెయ్ బావా—నవల మంచి
పట్టుగా వుంది' అన్నాడు రఘు, దృష్టిని,
చదువుతున్న పుస్తకంమీదనే నిలిపి.

వంటింట్లో అల్లరి చేస్తున్న సీనుని.
జానకి కేకలు వేసింది. 'వెధవ అల్లరీ
నువ్వూనూ—మామయ్య దగ్గరకు పోయి
కూర్చో—వెళ్ళు' అని.

సీను, తన రెండవ తరగతి తెలుగు
వాచకం, పెన్సిలు, తెల్లకాగితం తీసుకొని,
రఘు దగ్గర కొచ్చి 'మామయ్యా! ఈ
బొమ్మ గీసిపెట్టు' అంటూ, పుస్తకంలోని
ఏనుగు బొమ్మను చూపించాడు.

కథ మంచి పట్టులో వుందేమో
'ఇప్పుడు కాదు—తర్వాత' అని చెప్పి, మళ్ళీ
పుస్తకంలో లీనమైనాడు రఘు.

'ఊఁ! ఇప్పుడే కావాలి' అంటూ, రఘు
భుజం పట్టుకొని వూపటం ప్రారంభించాడు
సీను. రఘుకు కోపం వచ్చి! వాడి చేతిలోని
పెన్సిలు లాక్కుని, దూరంగా విసిరేడు.
దానితో, వాడికి కోపం వచ్చి, గది మూల
వున్న రఘు చెప్పుల జతలో ఒకటి తీసి,
వీధిలోకి విసిరేశాడు. వాడి మొండితనానికి
కోపం వచ్చిన రఘు, సీను బుగ్గమీద
గిల్లేడు.

నిజంగా సీనుకు నెప్పి కలిగినా, పైకి
నవ్వుతూ 'నాకేం నెప్పెక్కలేదు లేవోయ్'
అన్నాడు ధైర్యంగా.

'ఇప్పుడు?' కొంచెం గట్టిగా గిల్లి
అడిగాడు రఘు.

'ఉహూఁ—'

ఈసారి మరికొంచెం గట్టిగా గిల్లేడు.
ఆదెబ్బతో సీను, ఆరున్నొక్క రాగం ప్రారం
భించాడు. వంటింట్లోనుంచి జానకి 'ఏమి
టిరా అబ్బీ—నువ్వుకూడా కుర్ర వెధవతో
సమానంగానూ' అంది, వాడి ఏడుపు విని.

'నేనేం చెయ్యలేదక్కయ్యా ఊరికే
ఏడుస్తున్నాడు. సీనుగాడు' అని జానకితో
చెప్పి, 'సీనూ నువ్వు ఇంకా ఏడుస్తే, మీ

అమ్మవచ్చి నిన్నే తంతుంది నాకేం!' అన్నాడు
రఘు.

అదివిని, సీను, రాగాన్నింకాస్త పెంచాడు.

'సీనూ — నీకు బిళ్ళకొని పెడతాగాని,
ఏడవకురాబాబూ!' అని బ్రతిమాలేడు, తన
బెదిరింపు ఏమీ పనిచెయ్యకపోయేసరికి.'

సీను ఒక్కసారిగా ఏడ్పు మానేసి,
'రా—కొనిపెట్టు' అన్నాడు.

'మరి, నువ్వు విసిరేసిన చెప్పు తీసు
కురా.'

సీను బుద్ధిమంతుడిలా, చెప్పు తీసు
కొచ్చి లోపలపెట్టాడు.

'బిళ్ళ రేపు కొనుక్కొందాలే నువ్వు
ఎంతో మంచివాడివి సీనూ'' అని బుజ్జ
గించాడు.

సీను మళ్ళీ ఏడుపు మొదలుపెట్టేసరికి
తప్పదురా బాబూ అనుకొని, చదువుతున్న
పుస్తకాన్ని మూసి, 'మీ అమ్మతో చెప్పిరా'
అన్నాడు.

'నువ్వే చెప్పు' అన్నాడు సీను, బుంగ
మూతిపెట్టి.

'అక్కయ్యా—నేనూ సీనూ అలా వీధి
లోకి వెడుతున్నాం' అని, వంటింట్లో
వున్న జానకిని ఉద్దేశించి చెప్పాడు రఘు.

'ఎందుకు?' వంటింట్లోనుంచే అడి
గింది జానకి, మామిడికాయలను నీళ్ళలో
కడుగుతూ.

సీను చెప్పవద్దని సైగచేస్తున్నా, 'సీనుకి
బిళ్ళకొనటానికి' అని చెప్పేశాడు రఘు.

'వెధవకి—అస్తమానం బిళ్ళలేనా?—
నేను పెడతానుగాని, నువ్వెళ్ళారా' అని పిలి
చింది జానకి.

రఘు వంటింట్లోకి వెళ్ళేడు. 'సుబ్బు,
వాళ్ళనాన్నతో వెళ్ళింది, బజారుకు నువ్వు
కొస్త పక్కవాళ్ళింటికెళ్ళి ఆవకాయ కత్తి
పీట ఒకసారి అడిగి పట్రా బాబూ!' అంది.

నాకు వాళ్ళెవరూ తెలియదు' అని సాకు
చెప్పి, తప్పించుకోవాలని చూశాడు రఘు.

'తెలిసేదేముందిరా, నేనిమ్మన్నాననిచెప్పు,
ఇస్తారు' అని చెప్పింది జానకి.

'సరే!' అని, రఘు, సీనును వెంటపెట్టు
కొని, దగ్గరగావేసివున్న ప్రహరీగోడ తలుపు
తెరచుకొని, పక్కయింటి కాంపౌండులోకి

అడుగుపెట్టాడు రఘు. అక్కడ నలుగురు
అమ్మాయిలు ఆడుకుంటున్నారు. ఒకమ్మా
యికి కళ్ళకు గంతలు కట్టేరు. మిగతా
ముగ్గురూ ఆమెను తప్పించుకొని, పరు
గెడుతున్నారు. ఆ ఆటనుచూస్తూ, గేటు
దగ్గరనే బొమ్మలా నిలుచుండిపోయాడు
రఘు.

కళ్ళగంతలున్న అమ్మాయి రఘును
పట్టుకొని, 'అవును' అని అరచి, 'అమ్మ
దొంగా — ఎక్కడికి పారిపోతావు' అంది,
ఒకచేత్తో కళ్ళకు కట్టివున్న గుడ్డను
విప్పుకుంటూ. రఘుకు నోటమాట
రాలేదు. అంతలో ఒక అమ్మాయి 'ఉమా!'
అని గట్టిగా పిలిచింది.

ఉమ, కళ్ళు తెరచిచూచి, భయంగా
ఇంట్లోకి పారిపోయింది. ఆ వెనుకే మిగతా
ముగ్గురూ లోపలికి పరుగెత్తారు.

'రా మామయ్యా— లోపలికి వెడదాం'
అంటున్నాడు సీను.

'మళ్ళీ వద్దాంలే!' అని చెప్పి, సీను
చెయ్యిపట్టుకొని, వెనుకకు దారితీశాడు
రఘు.

ఉట్టి చేతులతోవచ్చిన రఘునుచూసి,
'ఏరా ఇవ్వలేదావాళ్ళు?' అని అడిగింది
జానకి.

'మామయ్య అసలు అడగనేలేదమ్మా!'
అన్నాడు సీను.

'అదేమిట్రా!' ఆశ్చర్యపోయింది జానకి.

'పక్క ఇంటాయన పేరేమిటి?' అని
అడిగాడు రఘు.

'భానుమూర్తిగారు—ఏం?'

'ఆయనకు ఆడపిల్లలున్నారా?'

'ఆగొడవంతా నీ కెందుకురా'

'ముందుచెప్పు'

'ఒక అమ్మాయివుంది.'

'ఆ అమ్మాయి పేరు?'

'ఉమ — ఇంతకీ సంగతేమిటి?' ఈ
ప్రశ్నలన్నీ ఎందుకు అడుగుతున్నాడో
అర్థం కాలేదు జానకికి.

'చచ్చాంపో! ఆ ఉమ అన్న
అమ్మాయివచ్చి, నా చేతిని గట్టిగా,
ఉడుంలా పట్టుకొని, 'అమ్మ దొంగా —ఎక్క
డికి పారిపోతావు?' అంది. అంతే – భయం
వేసి, పారిపోయి వచ్చేశాను' అన్నాడు రఘు.

వస్తున్న నవ్వును ఆపుకోలేక, 'అదే

చిత్రా అంది జానకి.

'అది అంతే!' అని వూరుకున్నాడు, రఘు.

నేను అందుకొని, 'అవ్వా! మరేమోనే వాళ్ళ ఉమేవో, కళ్ళకు గుడ్డలు చుట్టుకొని, దాగుడుమూతాలాట ఆడుతోందే'అని చెప్పాడు తల్లికి.

సంగతి పూర్తిగా అర్థం చేసుకొన్న జానకి 'బాగానే వుంది. నేను వెళ్ళి తెస్తాను గాని, నువ్వు ఇక్కడే వుండి, కాస్త పొయ్యి విసురు' అని చెప్పి, భానుమూర్తిగారింటికెళ్ళింది.





లింటాస్-L.52-140 TL

హిందుస్థాన్ లీవర్ ఉత్పత్తి

భానుమూర్తిగారి భార్య ఆదిలక్ష్మమ్మ పచ్చడి రుబ్బుకుంటూ, జానకిని చూసి, 'రావమ్మా! అలా కూర్చో, పీట వాల్చుకొని' అంది.

'పొయ్యి మీద బియ్యం పడేసి ఇలా వచ్చాను అక్కయ్యగారూ! మీ ఆవకాయ కత్తిపీట ఒకసారి కావాలండీ' అంది.

'ఆ భాగ్యానికి నువ్వు రావాలటమ్మా, పిల్లను పంపితే ఇవ్వనూ, అమ్మలూ—పిన్నిగారికి ఆవకాయ కత్తిపీట తెచ్చి ఇయ్యమ్మా' అంది ఆదిలక్ష్మమ్మ.

ఉమ తీసుకువచ్చి ఇచ్చింది.

'మా సుబ్బు, వాళ్ళ నాన్నగారితో బజారుకు వెళ్ళింది. ఇందాకా మా తమ్ముణ్ణి పంపించాను మీ ఇంటికి, దీనికోసం. వాడికి ఆడపిల్లలంటే, తగని సిగ్గు. మీ పిల్లలు ఇక్కడ ఆడుకుంటున్నారట. అది చూసి, వెనక్కి వచ్చేశాడు. వస్తానండి' అంటూ, కత్తిపీట తీసుకుని, లేచింది జానకి.

జానకి చెప్పినదంతా విన్న ఉమ బుగ్గలు ఎరుపెక్కాయి సిగ్గుతో, తను చేసిన పనికి! గదిలోనుంచి, ఆమె తోటి స్నేహితురాళ్ళ కిల కిలా నవ్వటం జానకికి కూడా వినిపించింది.

'మీ తమ్ముడెవరమ్మా?' ఆదిలక్ష్మమ్మ అడిగింది.

'పూనాలో ఎం. కాం. చదువుకుంటూ, ఉద్యోగం చేస్తున్నాడండి. మొన్న మధ్యాహ్నమే వచ్చాడు' అని చెప్పి జానకి వచ్చేసింది.

రాత్రి భోజనాలదగ్గర, నారాయణతో, జరిగిన విషయం అంతా చెప్పింది జానకి. అదివిని, నారాయణ. నవ్వుతూ 'ఏమోయ్ బావా—పాపం! ఆ అమ్మాయి ఎన్నాళ్ళనుంచి ఎదురు చూస్తూందో నీకోసం—ఇవాళ్టికి దొరికావ్ పెళ్ళాడే సెయ్యకూడదూ!' అన్నాడు పరిహాసంగా.

* * *

బీటలువారివున్న అద్దంలో, పిచిక, తన శత్రువును హతమార్చాలని శతవిధాల ప్రయత్నిస్తుంటే, వింతగా చూస్తున్నాడు రఘు. అక్కడనుంచే, తెరచివున్న పక్క ఇంటి కిటికీ, కిటికీగుండా జడ అల్లుకుంటున్న ఉమ—కనిపిస్తే, అటువైపుగా చూస్తూ కూర్చున్నాడు. అప్పుడే అక్కడకు నారాయణరావటం, పిచిక ఎగిరిపోవటం—జరిగింది. బహుశః, అది గమనించిగావును, ఉమ, కిటికీదగ్గరనుంచి పక్కకు తప్పుకొంది. ఇంకా అటువైపుగా చూస్తూ కూర్చున్న రఘును, 'ఏంబావా—పిట్టని చూస్తున్నావేమిటి?' అని. పలకరించాడు నారాయణ.

'ఆఁ.. ఏమిటి?' రఘు తడబడ్డాడు.

'అదే ... అదే .. పిచిక ఎగిరిపోయింది గదూ!.'

'అవును—'' చిరునవ్వు తెచ్చుకుంటూ అన్నాడు రఘు.

''పక్కవాళ్ళమ్మాయి మొన్ననే సెవెన్త్ ఫారం పరీక్షలువ్రాసింది. ఖాళీగావుంది. చాలా బుద్ధిమంతురాలు పాపం! ఏం తోచటంలేదట. పెళ్ళిచేసుకుంటే ఏమన్నా తోస్తుందేమో నువ్వు కాస్త నడుంకట్టకూడదూ!' రఘు అవస్థచూసి, ఉచితంగా ఓ సలహా ఇచ్చాడు నారాయణ.

'నడుం ఎందుకులే బావా తాళే కట్టేస్తాను' పరిహాసంగా అన్నాడు రఘు.

శెలవు పూర్తికాగానే రఘు మళ్ళీ పూనా వచ్చి ఉద్యోగంలోచేరటం—యమ్. కామ్. పరీక్ష క్లాసులో పూర్తిచేయటం పూనాలో ఉద్యోగానికి రాజీనామానిచ్చి, ఆంధ్రదేశంలోనే, కాలేజి లెక్చరరుగా ఉద్యోగం సంపాదించటం, తొమ్మిదిమాసాలు గడచిపోవటం జరిగింది.

ఆతరువాత, ఒక శుభముహూర్తాన, జానకిని చేయూతగా తీసుకొని, తల్లిదండ్రుల సంపూర్ణ అంగీకారంతో ఉమకు నిజంగానే తాళికట్టి, తన అర్ధాంగిగా చేసుకొన్నాడు రఘు. సంవత్సరం తిరిగేసరికి, జంటగా ఒకపాపను కూడా తీసుకు రమ్మని, ఉమను ఒంటరిగా పుట్టింటికి పంపాడు.

ఈ సందర్భంలోనే, ఉమకు మగపిల్లవాడు కలిగాడని, భానుమూర్తిగారు వ్రాసిన ఉత్తరం అందుకున్నాడు రఘు.

* * *

సిగరెట్టుపొగలో, ఎదురుకుండా కన్నుల ముందు నిలిచినది, ఉమ రూపం. అది చూస్తూ వుండిపోయాడు రఘు, కొన్ని క్షణాలు. చేతివేళ్ళకి సిగరెట్టు వేడితగిలి చురుక్కుమంది: సిగరెట్టు కిటికీలోనుంచి బయటకు విసిరేశాడు. కన్నులు బరువుగా, మత్తుగా వున్నాయి. చేతినున్న వాచీ చూశాడు. రెండున్నరైంది.

రఘు, సూట్‌కేసు చేత్తో పట్టుకొని, రైలుదిగి, ప్లాటుఫారంమీద తనకోసం వెతుకుతున్న భానుమూర్తిగార్ని చూశాడు. ఆయనకళ్ళు ఎర్రగా వాచివున్నాయి.

'మావయ్యగారూ. ఉమ ఎల్లావుంది?' అని అడిగాడు నవ్వుతూ.

భానుమూర్తిగారు ఆశ్చర్యంగా ముఖం పెట్టి 'నేనిచ్చిన టెలిగ్రాం అందలేదా నీకు?' అన్నారు.

'టెలిగ్రామా ?' తను చించిపారేసిన టెలిగ్రాం మళ్ళీ జ్ఞాపకం వచ్చింది రఘుకి.

'అవును...ఉమ, నిన్నమధ్యాన్నం...' భానుమూర్తిగారి కంఠం రుద్ధమైంది. వాక్యం పూర్తి చెయ్యకుండానే భుజంమీది కండువాను, నోటిలో కుక్కుకున్నారు.

రఘు, తన చేతిలోని. సూటుకేసు క్రిందపెట్టి, భానుమూర్తిగారి చేతులు పట్టుకొని, 'నాకుతెలుసు మావయ్యగారూ...'అన్నాడు, దుఃఖాన్ని ఆపుకుంటూ.

'సార్—పక్కకు తప్పుకోండి—మిమ్మల్నే. అంటున్నాడు: ట్రాలీమీద సామాను తెస్తున్న పోర్టరు. రఘు ఉలిక్కిపడి, వెనుదిరిగి, చూశాడు. సామానుతో నిండివున్న ట్రాలీ మీద కూస్తోంది.

* * *

రఘు ఉలిక్కిపడి లేచాడు. తనను ఎవరో తట్టి లేపుతున్నారు. కళ్ళుతెరచి చూశాడు. ఎవరో ముసలాయన !—'బాబూ—ఏవూరు వెళ్ళాలి?' అని అడుగుతున్నాడు.

పీడకల — పీడకల — అనుకొన్నాడు రఘు.

'ఏవూరు వెళ్ళాలిబాబూ?' మళ్ళీ అడిగాడు ముసలాయన.

ఏదో స్టేషనులో రైలు ఆగివుంది.

'విజయవాడ వెళ్ళాలి.'

'ఏలూరు వచ్చింది. మీరు నిద్రపోతున్నారు. ఇక్కడ దిగుతారేమోనని లేపాను' అంటూ, ఆ ముసలాయన రైలు దిగి వెళ్ళి

పోయాడో

తన సూట్‌కేసు వైపు చూసుకున్నాడు రఘు. భద్రంగానే వుంది. కిటికీగుండా బయటకు చూశాడు. కొంచెం కొంచెంగా అంధకారం తొలగిపోయి, వెలుగు రేఖలు కనుపిస్తున్నాయి. ఇంకా, బెజవాడ చేరా లంటే, ఒక గంటకూడా పట్టదు. అయినా, అదే తన మనస్సుకొక యుగంలా వుంది. ఎలా గడపటం? సిగరెట్టు తీసి ముట్టించాడు. మానవ జీవితంలా, సిగరెట్టు తరిగి పోతోంది. దాగిన నిజంలా, నిప్పుపైన కాడి గట్టింది. రఘు, సిగరెట్టును విదిలించాడు. నుసి రాలిపోయి, నిప్పు బయట పడింది.

విజయవాడ స్టేషనులో దిగాడు రఘు. తనకోసం ఎవరన్నా వచ్చారేమోనని చూశాడు. రిక్షా ఎక్కి, 'గవర్నరుపేట పోనియ్'అన్నాడు.

భానుమూర్తిగారు పేపరు చూస్తూ, కాఫీ చప్పరిస్తూ, రిక్షాలోంచి దిగిన రఘుని చూసి, పక్కగది వైపు తిరిగి, 'అమ్మలూ, రఘు వచ్చాడు' అన్నారు.

రఘు తిన్నగా ఆ గది దగ్గరకు వెళ్లాడు.

'ఉమా! బావా, నువ్వా కులాసానా?' అన్నాడు, ఆత్రంగా.

ఉమ బలహీనంగా మంచంపైన పడు కొని వుంది. రఘు ఆత్రతను చూసి, నవ్వింది, వెన్నెల కురిసినట్లుగా. 'ఇస్సా— ఇటు చూడకండి, బాబుకు శాంతి చెయ్యాలి. అంతవరకూ వీరు చూడకూడదు' అంది కొంటెగా ముక్కు మీద వేలేసుకొని, చిన్న పిల్లలకు, 'తప్పు' అని చెప్పే విధంగా.

రఘు కూడా నిండుగా, తృప్తిగా నవ్వేడు.

బారసాల అయ్యే వరకూ నా నామంగా ఇంట్లోనే వుండి, ఉమను, మరికొన్నాళ్లు పుట్టింటిలోనే వుంచటానికి నిశ్చయించు కొని, తిరిగి ఉద్యోగంలో చేరటానికి బయలు దేరాడు రఘు.

రైలు దిగి, ఇంటికి వచ్చి, తాళం తెరచిన రఘుకు ఒక కవరు, ఒక కార్డు కనుపించాయి

ముందు కార్డు చదివాడు రఘు.

డియర్ రఘూ!

నాకు కలకత్తా నుంచి మద్రాసుకు ట్రాన్స్‌ఫరు అయింది. సమేతంగా బయలుదేరాను. ఆ రోజునే నీకు టెలిగ్రాం ఇచ్చాను, ఎక్స్‌ప్రెస్‌కు స్టేషనుకువచ్చి కలుసుకోమని. నువ్వు స్టేషనుకు రాలేదు. నాకు టైములేక, దిగలేక

మా శ్రీమతి హేయాను వెరీసారీ—

నీ మిత్రుడు,
ఆంజనేయులు.

రఘు చేతిలో, కార్డుతోపాటుగావున్న కవరు తెరవటానికి కొన్ని క్షణాలు పట్టింది.



# పుష్పము మీ అదృష్టం చెప్పగలదు

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ, మీ సరియైన చర్యను గురించిన్నీ మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టుకార్డుపైన మీకుఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయుతేదీ, పేరువివరములున్నూ, మీసరియైన విరునామా, వెంటనే వ్రాసిపంపండి. జ్యోతిషశాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసినతేదీ లగాయతు 12 మాసములలోను మీ యొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏవ్యవహారములో మీకు జయముకలుగునో, ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, విధినిషేధములు, లాటరీ, అకస్మాత్ ద్రవ్య లాభముమొదలగువానిని గురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1.25 పై.లకు మాత్రము వి. పి. గా పంపగలము. వి. పి. చార్జీలు ప్రత్యేకం. దుష్టగ్రహములేవైనాఉన్నయెడల శాంతిచేయు విధానం కూడా తెలుపగలము. వివరములు మా పూచీపై పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా లేనియెడల పైకము వాపసుచేయబడును. ఒకసారిపరీక్షించండి. అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

PT. DEV DUTT SHASTRI, RAJ JYOTISHI,
(A. W. P.) Post Box No. 86, JULLUNDUR CITY.

లోమ




భారతదేశపు మొత్తం హేర్ ఆయిల్ ఎగుమతులలో 16% గా లెక్కించబడింది!

ఔను, లోమ ఇక్కడ భారతదేశంలో వలెనే విదేశములందు కూడా ప్రసిద్ధయింది అది ఎందువల్లననగా లోమ అత్యంత ఆనందకర మైనది, కేశ పోషణ మరియు శిరోజములను వలుపు చేసే హేర్ ఆయిల్స్ అన్నింటి కంటె అత్యంత గుణకరమైనది. పెద్ద, మధ్యమ, చిన్న సీసాలలోను మరియు పొమేడ్‌గా ట్యూబ్‌లలోను లభించుచున్నది.

ఏకైక ఏజెంట్లు మరియు ఎగుమతిదార్లు:-
ఎమ్. ఎమ్. ఖంబటా వాలా, అహమదాబాద్-1.